Eenadu Dt 16/11/17.





మియాపూర్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేస్తున్న కళల కేంద్రం ఇది. కళాకారులు గ్రాఫిటి విద్యను ఇక్కడ ప్రదర్శించవచ్చు.



బస్సులు ఆగేందుకు ఏర్పాటుచేస్తున్న ప్రయాణ ప్రాంగణం. సౌరఫలకలతో తొలిసారి ఏర్పాటు చేస్తున్నారు



వీధి వ్యాపారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు. కూరగాయలు, పండ్లు, ఇతరత్రా అమ్ముకునేలా అవకాశం

# విదేశీ హంగులు.. స్వదేశీ కళలు!

## మారిపోతున్న మియాపూర్ మెట్రోస్టేషన్ ముఖచిత్రం

ఈనాడు, హైదరాబాద్

నగరంలో మెట్రో రైలే కాదు. ప్రధానిమంత్రి మెట్రోరైలును ప్రారంభించే మియాపూర్ స్టేషన్ పరిసర ప్రదేశాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. భవిష్యత్తులో ఇదో సందర్శనీయ, స్వీయచిత్రాల(సెల్ఫీ)కేంద్రంగా మారనుందని అధికారులు అంటున్నారు. విదేశీ నగరాల్లో స్టేషన్ల వద్ద ఉండే వాతావరణాన్ని ఇక్కడా ప్రతిబింబించేలా పనులు జరుగుతున్నాయి. మియాపూర్ స్టేషన్ నుంచి కేపీహెచ్‌బీ వరకు హంగులద్దుతున్నారు. ప్రారంభం దృష్ట్యా ప్రస్తుతం మియాపూర్ చుట్టుపక్కలే పనులు చేస్తున్నారు. ఇప్పటికే ఆమోదించిన కొన్ని డిజైన్లలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. మన వారి అవసరాలు తీర్చేవిధంగా ఒక్కోటి సిద్ధం చేస్తున్నారు. పిల్లలు, పెద్దలు కుటుంబంతో సహా ఇక్కడ సేద తీరేలా.. ఆటలాడుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కళాకారుల అద్భుత చిత్రాలకూ వేదిక కానుంది. ఇతర ప్రాంతాల్లో సుందరీకరణ చేపట్టేందుకు దీనినొక నమూనాగా తీర్చిదిద్దుతున్నారు. భవిష్యత్తులో మెట్రో కారిడార్ల వెంట ఈ విధంగా అభివృద్ధి చేయాలనేది హెచ్ఎంఆర్ ప్రణాళిక.



స్టేషన్ల వద్ద పాదచారుల బాట పక్కనే బ్యాంకు ఏటీఎం, ఇతరత్రా ఏర్పాటుకు అనుకూలంగా కియోస్క్‌లు



మెట్రోలోని మూడు కారిడార్లను సూచించేలా ఏర్పాటు చేసిన పైలాన్ ఇలా ఉండబోతుంది.



మియాపూర్ స్టేషన్ పరిసరాలు రాత్రివేళ విద్యుత్తు కాంతుల నడుమ ఇలా కన్పిస్తాయి.

## మెట్రో కారిడార్‌ను పరిశీలించిన కేంద్ర నిఘా వర్గాలు

మెట్రోరైలును త్వరలో ప్రారంభించే కారిడార్‌ను కేంద్ర నిఘా వర్గాలు పరిశీలించాయి. మియాపూర్ నుంచి ఎస్ఆర్‌నగర్ వరకు మార్గాన్ని వారు తనిఖీ చేశారు. ఈ నెల 28న ప్రధానమంత్రి నరేంద్రమోదీ మియాపూర్‌లో మెట్రోకు పచ్చాజెండా ఊపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భద్రతరీత్యా నిఘా వర్గాలు పరిశీలించి వెళ్లాయని మెట్రో వర్గాలు పేర్కొన్నాయి.

## మెట్రో తళుకులు



కొద్దిరోజుల్లో నగరంలో మెట్రో రైలు పరుగులు తీయనున్న నేపథ్యంలో ఇప్పుడు ఎటుచూసినా సందడి కనిపిస్తోంది. పంజాగుట్ట నిమ్స్ సమీపంలో సిద్ధమైన మెట్రో మాల్ ఇది. రాత్రివేళల్లోనూ పనులు జరుగుతున్నాయి. విద్యుత్తు కాంతులతో వెలిగిపోతున్న దృశ్యం.